పడకేసిన పారిశుధ్యం.. పట్టించుకోని అధికారులు

- మానస గార్డెన్ లేన్‌లో బాలుర గురుకుల పాఠశాల ఎదుట రోడ్డుపై చెత్త కుప్పలు
- దోమల బెడద, దుర్వాసనతో ప్రజలు, విద్యార్థుల అవస్థలు

చంపాపేట, డిసెంబర్ 26 : నగరంలో పారిశుధ్యం మళ్లీ పడకేస్తున్నది. కాలనీల ప్రధాన రహదారుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. చెత్త కుప్పల వద్ద ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జనవాసాలను పరిశుభ్రంగా ఉంచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోగా నేడు ఆ పరిస్థితి కొరవడింది. కాలనీల ప్రధాన వీధుల వెంట ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోతున్నది.

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్-4 పరిధి కర్మన్‌ఘాట్-చంపాపేట చౌరస్తా రోడ్డులో మానస గార్డెన్ లేన్‌లో బాలుర గురుకుల పాఠశాల గేటు ఎదుట రోడ్డుపై చెత్త పెద్దఎత్తున పేరుకుపోయింది. శునకాలు చేరి ఆ చెత్తనంతా చిందరవందరగా చేయడంతో రోడ్డంతా చెత్తమయంగా మారింది. దాంతో చంపాపేట ఓల్డ్ విలేజ్, దళితబస్తీ, కొటికోనికుంట, నెహ్రూనగర్, రెడ్డిబస్తీ తదితర కాలనీలకు ఈ రోడ్డు నుంచే వెళ్తుంటారు. చెత్త చేరడంతో దుర్వాసన వస్తుండటంతోపాటు దోమల బెడదతో ఆయా కాలనీల ప్రజలు అట్నుంచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పక్కనే బాలుర గురుకుల పాఠశాల కొనసాగుతుండగా విద్యార్థులు ఏవిధంగా ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. చీకటి పడిందంటే చాలు ఆ దారిలో దోమల బెడద తీవ్రమై అట్నుంచి వెళ్లలేని దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి అక్కడి నుంచి వెంటనే చెత్తను తరలించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు. అంతే కాకుండా జనావాసాల నడుమ చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించాలని పేర్కొంటున్నారు.

చంపాపేటలోని బాలుర గురుకుల పాఠశాల సమీపంలో రోడ్డుపై పడవేసిన వ్యర్థాలు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, డిసెంబర్ 26 : కళానృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీ 16 వ వార్షికోత్సవాల సందర్భంగా కళానృత్య నికేతన్ అధ్యక్షురాలు నాట్యగురువు డాక్టర్ బిందు అభినయ్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళానృత్యనికేతన్ సంస్థను 2007లో స్థాపించి హైదరాబాద్ నగరం మంతా వివిధ శాఖలుగా విస్తరించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 146మంది ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పద్మజారెడ్డి, భాగవతుల సేతురామ్, కళాకృష్ణ, పద్మశ్రీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 26: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల(మహేంద్రహిల్స్)కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత తెలిపారు. ఈనెల 23 నుంచి తమిళనాడులోని దిండిగల జిల్లా కేంద్రంలో 46వ జాతీయ స్థాయి బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2024 జరిగింది. గురుకుల కళాశాలకు చెందిన కే.అనూష, బి. కల్పనలు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అనూష, కల్పనతోపాటు కోచ్ పద్మిని గుప్తాను ప్రిన్సిపాల్ అభినందించారు.

28న రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులు ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 26 : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డు బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో డిసెంబర్ 28న శనివారం ఉదయం 10గంటలకు ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా 86వ జయంతి సందర్భంగా పలువురు ప్రొఫెసర్లకు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రతన్‌టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఉన్నతవిద్యా శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు పాల్గొంటారని రాజ్ నారాయణ్ ముదిరాజ్ పేర్కొన్నారు.

కొత్త రోడ్డు..తవ్వేశారు

- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

అంబర్‌పేట, డిసెంబర్ 26 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు కొం దరి స్వయంకృతాపరాధంతో ధ్వంసమవుతున్నాయి. నిర్మించిన కొద్ది రోజులకే డ్రైనేజీ పైప్‌లైన్, తాగునీటి కనెక్షన్, స్పీడ్ బ్రేకర్ల పేరుతో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీంతో రహదారులకు ఏటా కోట్లలో నష్టం వాటిల్లుతోంది.

లక్షలు వెచ్చించి ఏడాది క్రితం నిర్మాణం..

స్థానికుల కోరిక మేరకు ఏడాది క్రితం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ లక్షలు వెచ్చించి వైభవ్‌నగర్‌లో కొత్త సీసీ రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు నిర్మించినప్పు డు మిన్నకుండిన ఓ ఇంటి యజమాని రాత్రికి రాత్రే దొంగతనంగా 20 ఫీట్ల వరకు తవ్వి పైప్‌లైన్ వేశా డు. అయినప్పటికీ వాటర్‌వర్క్స్ అధికారులు కానీ, జీహెచ్ఎంసీ అధికారులు కానీ చూసీచూడనట్లు మిన్నకుండిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా సదరు వ్యక్తి దగ్గర డబ్బులు తీసుకొని రోడ్డును తవ్వించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

వైభవ్‌నగర్‌లో అనుమతి లేకుండా తవ్వీన కొత్త రోడ్డు

అనుమతి తీసుకుంటే ఛార్జీలు ఇలా..

సిమెంట్ రహదారులైతే ఒక చ.మీ. రోడ్డు కటింగ్‌కు రూ. 2,040, బీటీ రోడ్డుకు రూ.3,250 చెల్లించాల్సి ఉంటుంది. చాలా మంది రోడ్డు కటింగ్ ఛార్జీలను తప్పించుకోవడానికి అనుమతి లేకుం తవ్వేస్తున్నారు.

రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలి..

తవ్వీన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు. డబ్బులకు ఆశపడి మంచి రోడ్డును తవ్వుతున్నా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ కార్మికులకు రూ. 12వేలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

చిక్కడపల్లి, డిసెంబర్ 26: భూమి లేని వ్యసాయ కార్మికులకు 12వేలు ఇవ్వాలని, లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, కేవీపీఎస్ నాయకుడు స్కైలాబాబు, సారంపల్లి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ ఆధారంగా రూ. 12వేలు అందజేసే పథకానికి ఎంపియ చేయబోతున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అన్నారు. లబ్ధిదారులను కుదించే చర్యలకు స్వస్తి చెప్పి గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు వెంకట్, శ్రీరామ్‌నాయక్, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు ప్రారంభం

బండ్లగూడ,డిసెంబర్ 26: రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనవరి 8 వరకు గురునానక్ హైస్కూల్ ఆవరణలో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తెలిపారు. పోటీలను ఉదయం 10గంటలకు మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న యజ్ఞ మహోత్సవాలు

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి విశేష కలశాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

మన్సూరాబాద్, డిసెంబర్ 24: నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో వైదిక విజ్ఞాన ట్రస్ట్ ఆధ్వర్యంలో రుగ్వేద, యజుర్వేద, సామవేద హవన సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు ఏకాదశి స్వాతి నక్షత్రమును పురస్కరించుకుని గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి విశేష కలశాభిషేకం చేశారు. వేద పండితులు పూజలు చేశారు.

భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వైదిక విజ్ఞాన ట్రస్ట్ వ్యవస్థాపకుడు వాడ్రేవు శ్రీనివాస్‌రావు, ధర్మరక్ష సంస్థ వ్యవస్థాపకులు చిట్టి హనుమత్‌శాస్త్రి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ యజ్ఞ మహోత్సవాల్లో భద్రాచల ఆలయ ఆస్థాన వేద పండితులు, ఉభయ వేదాంత విద్వాన్ గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

సంప్రదాయ కళల వ్యాప్తికి కృషి

ముషీరాబాద్, డిసెంబర్ 26: విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు అక్కడ భాష, సంప్రదాయ కళల వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్నారని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. బుధవారం ఎస్వీబీ మ్యూజిక్ ఇంటర్నేషనల్(యుఎస్ఏ)ఆధ్వర్యంలో శ్రీముఖి కాంప్లెక్స్ ఎలైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో ఎస్వీబీ మ్యూజిక్ ఇంటర్నేషనల్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్‌కు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డు ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డు అందజేశారు. అనంతరం వంశీ రామరాజు మాట్లాడుతూ.. విఖ్యాత గాయకుడు బాల సుబ్రహ్మణ్యం పేరిట సంగీత సంస్థను స్థాపించి ఆయన పాటలు అక్కడి వారికి ప్రచారం చేస్తున్న పాటల ప్రియుడు శ్రీనివాస్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో గాయకుడు పార్థసారథి, రామాచారి, వినోద్‌బాబు, వైఎస్ రామకృష్ణ, సుంకరపల్లి శైలజ, మధుర వీణ, సుధామయి తదితరులు పాల్గొన్నారు.

వీర్‌బల్ దివస్

అబిడ్స్, డిసెంబర్ 26 : వీర్‌బల్ దివస్ కార్యక్రమంలో భాగంగా మొజాంజాహి మార్కెట్ వద్ద గురు గోవింద్ సింగ్ చిత్ర పటానికి జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ ఇందర్ సింగ్, సర్దార్ రాజేంద్రసింగ్ టక్రాల్, సర్దార్ గురుదయాల్ సింగ్ గుల్లు, అమిత్ కార్వాండ, ఆనంద్ చౌదరి, చందుసార్థ, సర్దార్ మోహన్‌సింగ్, అవినాష్ దేవ్డా, వినోద్ చౌదరి, సందీప్ జైన్, చంద్రశేఖర్ తివారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి ఉపయోగపడాలి


కారుణ్యసింధు బాలుర ఆశ్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రామచంద్రయ్య

సైదాబాద్, డిసెంబర్ 26 : సైదాబాద్‌లోని కారుణ్య సింధు ఆశ్రమంలో గురువారం వీర బాలదివస్ కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత ప్రశిక్షణ రామచంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఆశ్రమ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు దేశభక్తి, దైవ భక్తిని పెంచుకుని విద్యలో రాణించాన్నారు. సమాజానికి ఉపయోగపడే యోగ్యులుగా అన్ని రంగాల్లో రాణించి ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో కారుణ్య సింధు ఆశ్రమ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సేవా సమితి అధ్యక్షుడు సత్యమూర్తి, జైపాల్ రెడ్డి, శంకర్, ఈదన్న, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

కాచిగూడ, డిసెంబర్ 26: కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో బీసీ సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాతీ య బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్న బీసీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బీసీల కుల వృత్తుల వారికి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు. కృష్ణ, ముత్యాల్ రావు, ప్రదీప్‌గౌడ్, కిశోర్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

రామంతాపూర్, డిసెంబర్ 27 : రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్,బాబ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైవ్ లో సైలెన్సర్లతో భారీ ఎత్తున శబ్దకాలుష్యానికి గురి కావడమే కాకుండా వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా బైకర్లపై చర్యలు తీసుకున్నారు. అలాంటి ద్విచక్ర వాహనాలను గుర్తించి సైలెన్సర్లను తొలగించారు. అంతే కాకుండా వెయ్యిరూపాయల జరిమానా విధించారు.కొత్త సైలెన్సర్లను అమర్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రెండోసారి పట్టు బడితే చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశ పెడుతామన్నారు.చట్టపరమైన చర్యలుంటాయన్నారు.నూతన సంవత్సర వేడుకలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేశ్, నరేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీడీఈఫ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

చిక్కడపల్లి, డిసెంబర్ 26: దివ్యాంగ జన్ డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(డీడీఈఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్ ఎంపికయ్యారు. అసోసియేషన్ సమావేశం గురువారం బాగ్‌లింగంపల్లిలో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి సంఘం నాయకులు హాజరై ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్‌ను నియమించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

- సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు అజీజ్‌పాషా

బడంగ్‌పేట, డిసెంబర్ 26 : దేశానికి సోషలిజమే దేశానికి ప్రత్యామ్నాయం అని రాజ్యసభ మాజీ సభ్యుడు అజీజ్ పాషా అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కొనసాగుతున్నాయన్నారు. భారత్‌లో ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నాయని, పేద వాడు మరింత పేద వాడుగా ధనికుడు మరింత ధనికుడిగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దోపిడీ లేని సమాజం రావాలన్నారు. దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం తాము ఉద్యమిస్తామన్నారు. ప్రజలంతా సమానంగా ఉండాలంటే దేశంలో సోషలిజం రావాలన్నారు. కమ్యూనిస్టు పోరాటాల ద్వారానే సోషలిజం వస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, వారి ఆశయాల సాధన కోసం ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, రవీంద్రాచారి, బాలరాజు, శివనాయక్, యాదమ్మ, అంజయ్య, చక్రునాయక్, శ్రీనివాస్, నాగమణి, రజిత, లక్ష్మి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ నగర్‌లో సీపీఐ జెండాను ఎగురవేసిన అజీజ్‌పాషా, పాల్గొన్న నాయకులు

యువత రక్తదానానికి ముందుకురావాలి

శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

మన్సూరాబాద్, డిసెంబర్ 26: రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సుష్మ చౌరస్తా సమీపంలోని ప్రసిద్ధ్ మల్టీ స్పెషాలిటీ దవాఖానలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రమాదాల బారిన పడి, ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన ఎంతోమందికి సమయానికి రక్తం దొరకక విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసిద్ధ్ హాస్పిటల్ ఎండీ జూకూరి చైతన్యరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 26: గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆశావర్కర్ల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చంలో ఘోరంగా విఫలమైందని సనత్‌నగర్ జోన్ సీఐటీయూ కన్వీనర్ పి.మల్లేశ్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామంటూ ఇచ్చిన హామీ లేమయ్యాయని ప్రశ్నించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 31న ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న బస్ జాతా ముగింపు సభ జరుగనుంది. గురువారం బోయిగూడలోని గాంధీ ఆరోగ్య కేంద్రంలో సీఐటీయూ టీజీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి అనిత, వెంకటమ్మ, పద్మసుశీల, మహేశ్వరి, వరలక్ష్మి, నందినితో కలిసి పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటం

కందుకూరు, డిసెంబర్ 26 : సిద్దిపేటలో ఈనెల 25 వరకు నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో కందుకూరు గ్రామానికి చెందిన కందడి శ్రీరామ్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జానారెడ్డి, రాంబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. రాష్ట్రంలో అనేక రకాల విద్యాసమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. తనకు బాధ్యతలను అప్పగించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, డిసెంబర్ 26 : వివిధ విద్యుత్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డీఈ కేకే రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ స్వగృహా ఏ, బీ-బ్లాక్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు సరోజినీనగర్, న్యూ హరిపురికాలనీ, హరిపురి కాలనీ, జనప్రియ గార్డెన్ పరిసర ప్రాంతాలు, వాంబే కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సౌత్‌ఎండ్ పార్కు, పాత్రీకేయనగర్, స్వాతిగార్డెన్స్, వీగార్డ్ ఫీడర్ పరిధిలో వాంబే కాలనీ, మన్సూరాబాద్, విశాలాంధ్ర, రాక్‌టౌన్, బిగ్ బజార్ వెనుక ప్రాంతం, బాలాజీనగర్, రాక్‌టౌన్ ఫీడర్ పరిధిలో రాక్‌హిల్స్, రాక్‌టౌన్, విశాలాంధ్ర పరిసర ప్రాంతాలు, చాణిక్యపురి ఫీడర్ పరిధిలో బండ్లగూడ,ఆనంద్‌నగర్ ప్రధాన రహదారి, జీఎస్ఐ పరిధిలో జీఎస్ఐ ఇండ్రస్టీయల్ ఏరియాస్, 3 నోస్స్ హెచ్‌టీ సర్వీస్, హనుమాన్‌నగర్ పరిధిలో సాయినగర్ రోడ్ నంబర్ 1,2,3, చాణిక్యపురి కాలనీ, హనుమాన్‌నగర్, విజయనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు బృందావన్ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, ప్రగతినగర్, పుకట్‌నగర్, ఆర్టీసీ కాలనీ, శుభోదయ కాలనీ, శ్రీదుర్గానగర్, సుబ్రమణ్య కాలనీ, వీరభద్ర కాలనీ, విజయనగర్, వినాయకనగర్, ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాఘవేంద్ర కాలనీ,. మదర్ డైరీ, లెక్చరర్స్ కాలనీ పరిధిలో, లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎస్ఆర్ఎల్ కాలనీ, నాగేశ్వర్‌రావు కాలనీ, సత్యనారాయణ కాలనీ, గౌడ్స్ కాలనీ, కోహెడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు శాంతినగర్, బ్యాంక్ కాలనీ, సదాశివనగర్, మైత్రీశిరిపురం పరిసర ప్రాంతాలు. పసుమాముల పరిధిలో పసుమాముల, కమలానగర్, శ్రీరామ్‌నగర్, పసుమాముల, కొత్తపేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు కొత్తపేట్ విలేజ్, ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాలు, న్యూ మారుతీనగర్, కల్వంచ, చిత్రలేఅవుట్, సాయి కాలనీ, జైపురి కాలనీ పరిధుల్లోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ పేర్కొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలి

- అసభ్యంగా ప్రవర్తించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

చిక్కడపల్లి, డిసెంబర్ 26: ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మహాలక్ష్మి గర్ల్స్ హాస్టల్‌ను మూసి వేయాలని, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం ఆ హాస్టల్ ఎదుట ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావీద్ మాట్లాడారు. ఇరుకైన గదుల్లో వసతి కల్పిస్తూ అధిక ఫీజుల వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మహాలక్ష్మి హాస్టల్‌లో శ్యామ్‌బాబు అనే వార్డెన్ విద్యార్థునులతో అనుచితంగా ప్రవర్తిస్తూ ఫీజుల పేరుతో వేధిస్తున్నారని మంపడ్డారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. పుట్టగొగుల్లాగా పుట్టుకొస్తున్న హాస్టల్స్‌పై ప్రభుత్వం నిరంతరం నిఘా పెట్టి కనీస నిబంధనలు పాటించని హాస్టల్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు లెనిన్, ప్రశాంత్, శ్రీమాన్, చరణశ్రీ, విష్ణోష్, రాజేశ్